www.samasamajam.in

# సమ సమాజం

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం...  తెలుగు దిన పత్రిక

తెలంగాణ | మంగళ వారం, 30ఆగస్టు 2022 | ఎడిటర్ : గోసుకొండ పృధ్వీరాజు | సంపుటి - 07, సంచిక-137 | పేజీలు - 4  వెల రూ. 5/-

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak

# బిజెపి ముక్త భారత్‌తోనే దేశానికి మేలు



- అవినీతి గద్దలను గద్దె దించాల్సిందే
- కార్పోరేట్ గద్దలకు దోచి పెడుతున్న మోడీ
- ఎనిమిదేళ్లుగా దేశంలో ఒక్క మంచి పనీ చేయని బిజెపి
- గుజరాత్ మోడల్ పేరుతో దేశాన్ని మోసం చేసిన మోడీ
- మోడీకి మీటర్ బిగించాల్సిన సమయం వచ్చింది
- జాతీయ రాజకీయాల్లో ప్రవేశించి ప్రభంజనం సృష్టిస్తా
- పెద్దపల్లి కలెక్టరేట్ ప్రారంభించిన అనంతరం సభలో కెసిఆర్ నిప్పులు
- చెప్పులు మోసే వెధవులుకూడా కారుకూతలు
- అలాంటి వారిపట్ల జాగ్రత్తగా ఉండాలి
- మేధావులు,కళాకారులు అప్రమత్తంగా ఉండాలి
- పరోక్షంగా బండి సంజయ్‌పై ఘాటు విమర్శలు

**పెద్దపల్లి, అగస్టు 29 (సమ సమాజం):** బిజెపి ముక్త భారత్ కావాలంటూ సిఎం కెసిఆర్ పిలుపునిచ్చారు. దేశాన్ని కార్పోరేట్ గద్దలకు దోచి పెడుతున్న బీజేపీ అవినీతి గద్దలను గద్దె దించి.. వారి నుంచి ఈ దేశానికి విముక్తి పలుకాలని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. గత ఎనిమిదేళ్లుగా దేశానికి ఒక్కటంటే ఒక్క మంచి పని చేయకపోగా..దేశాన్ని దివాళా తీయిస్తున్నారని ప్రధాని నరేంద్ర మోడీపై ప్రత్యక్ష దాడికి దిగారు. గుజరాత్ మోడల్ అని చెప్పి ఈ దేశాన్ని మోసం చేశారని కేసీఆర్ ధ్వజమెత్తారు. పెద్దపల్లి జిల్లాలో సమీకృత కలెక్టరేట్ భవనాన్ని ప్రారంభించిన అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం ప్రసంగించారు. పెద్దపల్లి జిల్లా అవుతుందని మనం కలలో కూడా అనుకోలేదు. తెలంగాణ ఏర్పడ్డది కాబట్టి పెద్దపల్లిని జిల్లా చేసుకున్నాం. అద్భుతమైన కలెక్టరేట్‌ను ఏర్పాటు చేసుకున్నాం. జిల్లా ప్రజాప్రతినిధులను, అధికార యంత్రాంగాన్ని, ప్రజలందరినీ హృదయపూర్వంగా అభినందిస్తున్నాను. చాలా మంచి కార్యక్రమాలు చేసుకున్నాం. పేదలు, రైతులు, ప్రజలు, మహిళలు గురించి మంచి కార్యక్రమాలు చేసుకుంటూ ముందుకు పోతున్నాం. భారతదేశమే ఆశ్చర్యపోయే విధంగా.. అద్భుతమైన పద్ధతిలో మనం ముందుకు వెళ్తున్నామని కేసీఆర్ పేర్కొన్నారు. ఈ ప్రాంతం గురించి మీకు తెలుసు. సింగరేణిలో వేల మందికి డిపెండెంట్ ఉద్యోగాలు దొరకుతున్నాయి. దేశంలో ఎక్కడా ఇవ్వని విధంగా సింగరేణి

3వ

## ట్రేడింగ్ యాప్ పేరుతో అమాయకులకు టోకరా

- భారీ క్రైను చేధించిన పోలీసులు
- దాదాపు పదికోట్ల వరకు నేరగాళ్ల వసూళ్లు
- రూ.9.81 లక్షలను రికవరీ చేసిన సైబరాబాద్ పోలీసులు





**హైదరాబాద్, అగస్టు 29 (సమ సమాజం):** దేశంలోనే అతిపెద్ద సైబర్‌క్రైమ్‌కు సంబంధించి సైబరాబాద్ పోలీసులు భారీ నగదు రికవరీ చేశారు. ట్రేడింగ్ యాప్ పేరుతో అమాయకుల నుంచి రూ.10 కోట్ల వరకు వసూలు చేసిన ముఠాను అరెస్టు చేసిన పోలీసులు, వారి నుంచి రూ.9.81 లక్షలను రికవరీ చేశారు. ఇప్పటి వరకు నలుగురు కేటుగాళ్లను కటకటాల్లోకి నెట్టగా, ఈ వ్యవహారంలో మరింత లోతుగా విచారణ జరుపుతున్నారు. మార్కెట్ బాక్స్ ట్రేడింగ్ యాప్ పేరిట మోసం, తొలిసారి భారీ నగదు

3వ

### మునుగోడు ఉపఎన్నిక టీఆర్ఎస్ అభ్యర్థి

## కేసీఆర్ విపర్యాస నిర్ణయం?



### కూసుకుంట్లకు టికెట్ ఇస్తే ఓటమి ఖాయం : కంచర్ల

మునుగోడు నియోజకవర్గ టీఆర్ఎస్ ఉపఎన్నిక అభ్యర్థి విషయంలో ఉత్కంఠ తారాస్థాయికి చేరుకుంది. మునుగోడులో మారుతున్న రాజకీయా పరిణామాల దృష్యా నిన్నటివరకు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్లని దాదాపుగా తుది అభ్యర్థిగా ప్రకటించేందుకు సిద్ధమైనట్లు విశ్వసనీయ సమాచారం. అన్ని సర్వే రిపోర్టులు కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డికి అనుకూలంగా ఉండటం, మునుగోడు నియోజకవర్గంలో క్యాడర్‌ను పెంపొందించుకోవడంతో సక్సెస్ కావడంతో, గులాబి బాస్ కేసీఆర్‌కు విధేయుడిగా, మంత్రి గుంతకండ్లకు అనుచరుడిగా మెలుగుతూ పార్టీ కోసం అహర్నిషలు కృషిచేస్తున్న కూసుకుంట్లకు అదిష్టానం షాకిచ్చే అవకాశం ఉంది. మునుగోడు నియోజకవర్గ రాజకీయ పరిణామాల దృష్యా కంచర్ల కృష్ణారెడ్డి పేరు తెరపైకి వచ్చింది. ఉన్నట్టుండి అభ్యర్థిని మార్చేందుకు గల కారణాలు ఏమిటో కాని కేసీఆర్ నిర్ణయం విపర్యాస నిర్ణయంగా మారుతుందో? లేదో వేచి చూడాల్సిందే. ఇద్దరు నేతలలో ఒక్కరిని అభ్యర్థిగా ప్రకటించే అవకాశం ఉండటంతో కూసుకుంట్లకు టికెట్ ఇస్తే టీఆర్ఎస్ ఓటమి పాలౌతుందని కంచర్ల కృష్ణారెడ్డి.. కూసుకుంట్లపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రస్తుతం కృష్ణారెడ్డి చేసిన వ్యాక్యలు పార్టీలో ఆందోళన కలిగించే అంశంగా మారింది.

**హైదరాబాద్, ఆగస్ట్ 29 (సమ సమాజం):** కేసీఆర్ సారధ్యంలో మంత్రి గుంతకండ్ల జగదీశ్వరెడ్డి మునుగోడులో పార్టీ బలోపేతం కోసం విస్తృత పర్యటనలు చేస్తున్నారు. మునుగోడు నియోజకవర్గ టీఆర్ఎస్ ఇంచార్జ్ కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి తనదైన శైలిలో పార్టీ క్యాడర్‌ను పెంపొందించుకునేందుకు మంత్రితో కలిసి కృషి చేస్తున్నారు. ఈ క్రమంలో టీఆర్ఎస్ ఉపఎన్నిక అభ్యర్థి విషయంలో గుంతకండ్ల ప్రతిపాదించిన వ్యక్తి కూసుకుంట్ల కాగా కంచర్ల భూపాల్‌రెడ్డి తన సోదరుడైన కృష్ణారెడ్డిని ప్రతిపాదిస్తూ సీఎం దృష్టికి తీసుకుపోయారు. అయితే ప్రస్తుతం రాజగోపాల్‌రెడ్డిని ఎన్నికలలో ఆర్థికంగా తట్టుకునేందుకు సరైన వ్యక్తి కంచర్ల బ్రదర్స్ అని, కంచర్ల కృష్ణారెడ్డి ఆసక్తిని గమనించిన కేసీఆర్ ఆ దిశగా ఆలోచిస్తున్నట్లుగా తెలుస్తుంది. ఇప్పటికే మంత్రి జగదీశ్వర్‌రెడ్డితో సంప్రదింపులు చేశారని, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిని ఒప్పించేందుకు ప్రయత్నిస్తున్నారని విశ్వనీయ సమాచారం. ఈ విషయంపై గులాబీ బాస్ కేసీఆర్ తుది నిర్ణయం త్వరలో ప్రకటించనున్నట్లు తెలుస్తుంది. అభ్యర్దులు కంచర్ల కృష్ణారెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిలలో ఎవరిని ప్రకటించాలనే విషయమై కేసీఆర్ తర్జన భర్జన చేస్తున్నట్లు తెలుస్తుంది. ఇదిలా ఉంటే టీఆర్ఎస్ పార్టీలో నేతల మధ్య కోల్డ్‌వార్ కొనసాగుతుంది. కంచర్ల కృష్ణారెడ్డి ఇటీవల కొన్ని సంచలన విమర్శలు కూసుకుంట్లపై చేశారు. కూసుకుంట్లకు టికెట్ ఇస్తే టీఆర్ఎస్ ఓటమిపాలవ్వడం కాయం అంటూ కామెంట్ చేయడంతో కంచర్లపై సర్వత్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



**కంచర్ల బలం**

- తన సోదరుడు సిట్టింగ్ ఎమ్మెల్యే
- ఆర్ధికంగా బలం
- సేవాదృక్పదం
- రైతులతో సంబంధాలు
- టీడీపీ క్యాడర్ పరిచయాలు
- బంధుగనం

**కూసుకుంట్ల బలం**

- కేసీఆర్, గుంతకండ్ల బలం
- ఆర్ధిక బలం
- అందరిలో కలిసిపోయే గుణం
- క్షేత్రస్థాయిలో పార్టీ క్యాడర్‌ను కలుపుకు పోవడం, మృదు స్వభావి



### భాషా సంస్కృతులే మన చిరునామా

భాషా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన వెంకయ్య

2వ



### మిడ్‌మానేరు నిర్వాసితులపై లాఠీ

ఇదేనా రైతు సంక్షేమం అంటూ రేవంత్ ట్వీట్

2వ



2వ

### బిజెపి ఆపరేషన్ కమలం విఫలం

- సొంత ప్రభుత్వంపై ఆప్ విశ్వాస తీర్మానం
- అసెంబ్లీలో బిజెపి తీరును ఎండగట్టిన సిఎం కేజ్రీవాల్




2వ

### గెలుపు అంత సునాయాసంగా దక్కలేదు

- చివరి వరకు నరాలు తెగే ఉత్కంఠత
- పాండ్యా సమయోచిత ఇన్నింగ్స్‌తో విజయబావుటా
- ఆసియాకప్ తొలి మ్యాచ్‌లో పాక్‌పై టీమిండియా గెలుపు

## సంపాదకీయం

# ఉద్యమ సమిధలుగా రైతులు !

ఇప్పటివరకు మోడీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం ఒక్కటంటే ఒక్క రైతు అనుకూల నిర్ణయం తీసుకోలేదు. సాగుచట్టాలు తీసుకుని వచ్చాక అవి ఎందుకు మంచివో చెప్పలేకపోయింది. వాటిని రద్దుచేస్తున్న సమయం లోనూ ఎందుకు రద్దు చేస్తుందో చెప్పలేదు. ఆందోళనలో చనిపోయిన రైతులను కనీసంగా చనిపోయినట్లు గా కూడా గుర్తించలేదు. గత ఎనిమిదేళ్లలో దేశవ్యాప్తంగా జాతీయ సాగు విధానం తీసుకుని రావవడం లోనూ.. దేశీయంగా పంటలను ప్రోత్సహించడంలోనూ విఫలమయ్యింది. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్న మోడీ పండించిన పంటలను కొనుగోలు చేసే దిక్కు లేకుండా చేసింది. కార్పొరేట్ సంస్థలు తీసుకున్న వేల కోట్ల బ్యాంకు రుణాలను మాఫీ చేస్తుంది కానీ.. రైతు రుణాలను మాఫీ చేయదు. అంబానీ, అదానీలకు దేశ సంపదను దోచిపెడుతున్నది. అలాగే ప్రభుత్వరంగ సంస్థలను తెగనమ్ముతోంది. ఇది కర్షకుల ప్రభుత్వం అంటూనే కార్పొరేట్లకు దోచిపెట్టే ప్రయత్నాల్లో ఉంది. లాభాలు వచ్చే ప్రభుత్వరంగ సంస్థలను అమ్ముతున్నారు. ఎందుకు అమ్ముతున్నారో అమ్మేవారికే తెలియాలి. ఈ ప్రభుత్వం సామాన్య లకు ఉపయోగపడే ఒక్క పని కూడా చేయడంలేదు. రైతులంటే బీజేపీ ప్రభుత్వానికి లెక్కలేదు. ప్రజలపై వారికి పట్టింపు లేదు. కార్మికుల సమ్మెలను ,రైతుల ఆందోళనలను పట్టించుకుని వారితో మాట్లాడడంలేదు. కొట్లాడి సాధించుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని తెగనమ్మవద్దని చేస్తున్న ఆందోళనలను కూడా లెక్క చేయడం లేదు. ఈ క్రమంలో సిఎం కెసిఆర్ రైతుల్లో ఉన్న వ్యతిరేకతను ఆధారంగా చేసుకుని రాజకీయం గా వాడుకోవాలని చూస్తున్నారు.నిజానికి రైతుల పక్షాన ఆయన పోరాడితే మంచిదే. దేశంలో ప్రస్తుతం ఒక రాజకీయ ప్రత్యామ్నాయ అవసరం. బీజేపీ, కాంగ్రెస్ వంటివాటితో దేశానికి ప్రయోజనం లేదని తెలిపో యింది. బీజేపీ రాజకీయ లబ్దిపొందే ప్రయత్నాల్లో మాత్రమే ఉంది. అన్ని రాష్ట్రాల్లో పాగా వేయడం ఎలా అన్న ప్రణాళికతో ఉందుకు పోతున్నది. కాంగ్రెస్ సొంత సమస్యలతోనే సతమతం అవుతున్నది. ఈ నేపథ్యంలో రైతులను సంఘటితం చేయడం ద్వారా బిజెపికి ప్రయత్నామ్నాయంగా వారిని ఉద్యమ క్షేత్రాలుగా మలచాలన్నది కెసిఆర్ వ్యూహంగా కనిపిస్తోంది. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక ఆలోచనతో ఉన్నారు. రైతులు కేంద్రంగా ఒక ప్రత్నామ్నాయ వేదిక ఉండాలన్నది ఆయన అభిప్రాయంగా ఉంది. అందుకే గత రెండు రోజులులగా హైదరాబాద్ వేదికగా రైతు సంఘాల నేతలతో చర్చించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల రైతు సంఘాల నేతలను ఆహ్వానించి వారితో చర్చించి, తెలంగాణ మోడల్‌ను ముందుంచారు. ఇక్కడికి వచ్చిన రైతుసంఘాల ప్రతినిధులంతా తమ తమ కార్యక్షేత్రాలకు వెళ్లి త్వరలోనే సమావేశాలు ఏర్పాటు చేసుకుని చర్చించేలా దిశానిర్దేశం చేశారు. ప్రత్యా మ్నాయంపై వీరు చర్చిస్తారు. ఒక కొత్త ప్రత్యామ్నాయ పోరాట పంథాను మేం నిర్మించుకునేలా వారిని కార్యోన్ముఖులను చేశారు. నిజానికి దేశంలోని రైతు సమస్యలను పరిష్కరించడం పాలకులకు పెద్దపని కాదు. దీంతో ఆర్థికంగా దేశం బలపడుతుంది. అలాగే ఉపాధి,ఉద్యోగ రంగాలు బలపడుతాయి. వ్యవసాయ అనుబంధరంగాల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.దిగుమతులను తగ్గించుకునే వీలుంటుంది. పప్పులు, నూనెలు అదేపనిగా దిగుమతి చేసుకునే అవసరం రాదు. కానీ కాంగ్రెస్ కావచ్చు, ప్రస్తుత బిజెపి కావచ్చ ఈ తరహా ఆలోచనలుచేయలేదు. తెలంగాణలో రైతులకు రైతుబంధు పేరుతో ఏడాదికి ఎకరానికి రూ.పదివేలు ఇస్తున్నా అది కేవలం కంటితుడుపు చర్యగానే చూడాలి. రైతులు సాగుకు సిద్ధమయ్యే సమయానికి పెట్టు బడి సహాయం అందుతున్నట్లు ప్రకటించినా,అది కూడా దుర్వినియోగం అవుతోంది. అందులోనూ వ్యవసాయ భూములు ఉండి, వ్యవసాయం చేయని వారికి కూడా రైతుబంధు అందడం వల్ల లక్ష్యం దెబ్బతింటోంది. తెలంగాణలో అందరికీ 24 గంటలపాటు విద్యుత్తు ఉచితంగా ఇస్తున్నారు. ఇది కూడా దుర్వినియోగం అవుతున్న మోటర్లు పెట్టమని చెప్పడం ద్వారా రాజకీయకోణంలో ఆలోచన చేస్తున్నారు. ఈ క్రమంలో రెండ్రోజుల పాటు జరిగిన సమావేశాల్లో రైతులు తెలంగాణ విధానాల పట్ల బాగా ఆసక్తి చూపారనే చెప్పాలి. దేశానికి కొత్త దిశ చూపిన నేత కేసీఆర్ అని చాలామంది అభిప్రాయ పడ్డారు. గతేడాది దేశంలో నల్లచట్టాలకు వ్యతిరేకంగా జరిగిన రైతాంగ పోరాటంలో వీరిలో చాలామంది ముఖ్యభూమిక పోషించారు. రైతులను సమీకరించడంలో, ఢిల్లీ సరిహద్దుల్లో మోహరించడంలో వీరు మందున్నారు. దేశ రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలు, తెలంగాణలో వ్యవసాయం, రైతుల స్థితిగతుల గురించి కెసిఆర్ సంఘాల నేతలతో సవివరంగా మాట్లాడారు. రైతులు, రైతుసంఘాల ప్రతినిధులు తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న వ్యవసాయాభివృద్ధి, రైతు సంక్షేమ విధానాలను పరిశీలించి సంతృప్తి చెందారు. దేశానికి తెలంగాణ ఒక కొత్త దిశను చూపిస్తున్నదని చెప్పడం విశేషం. సమస్యల పరిష్కారానికి సీఎం కేసీఆర్ చూపిస్తున్న చొరవ దేశంలోని మరే రాష్ట్ర ముఖ్యమంత్రీ చూపించడంలేదని కూడా అన్నారు. ఒక్క రైతు, వ్యవసాయ విధానాలే కాదు.. ఇక్కడ ఇస్తున్న పెన్షన్లు, దళితబంధు, ఇంటింటికి తాగునీళ్లు.. వంటి అనేక పథకాలను కూడా కెసిఆర్ వారికి వివరించడంతో వారంతా ఆనందం వ్యక్తం చేయడం గమనార్హం. ఇకపోతే దేశవ్యాప్తంగా రైతుల ఆత్మహత్యలు ఆందోళనకరంగా ఉన్నాయి. రైతులు, రైతుకూలీల ఆత్మహత్యలు సవాల్‌గా మారాయి. చాలాచోట్ల ఇవి రికార్డు కూడా కావడంలేదు. వీటిని లెక్కల్లో చూపేందుకు ప్రభుత్వాలు ముందుకు రావడం లేదు. మొత్తంగా బిజెపిని గట్టిగానే ఢీకొనాలని చూస్తున్న కెసిఆర్ తనుద్యమంలో పావులుగా ముందు రైతులను ఎంచుకున్నారు. వారి ద్వారా ఉద్యమాన్ని ముందుకు తీసుకుని వెళ్లే ఆలోచనలో ఉన్నారు. ఇది ఎంతవరకు సక్సెస్ అవుతుందన్నది చూడాలి. అయితే రైతుల్లో ఉన్న వ్యతిరేకత కెసిఆర్‌కు కలసి వచ్చే అవకాశంగా చూడాలి. రైతులను సంఘటితం చేయడం ద్వారా దేశంలో వ్యవసాయరంగం అభివృద్ధికి బాటలు పడితే మంచిదే.

పృద్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

# జియో కష్టమర్లకు రిలయన్స్ శుభవార్త

నాలుగు ప్రధాన నగరాల్లో 5జీ సేవలు● ప్రకటించిన రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ




**ముంబై, ఆగస్ట్ 29 (సమ సమాజం):** జియో కష్టమర్లకు రిలయన్స్ శుభవార్త పలికింది. ఈ ఏడాది దీపావళి నాటికి దేశంలోని ప్రధాన నగరాల్లో జియో 5జీ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ మేరకు రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ ప్రకటన చేశారు. ముందుగా ఢిల్లీ, ముంబై, కోల్ కతా, చెన్నై లాంటి ప్రధాన నగరాల్లో జియో 5జీ సేవలను అందుబాటులోకి తెస్తామన్నారు. ఆ తర్వాత క్రమంగా 2023 డిసెంబర్ వరకు దేశంలోని ఇతర ప్రధాన నగరాలు, జిల్లాలు, మండలాలకు జియో 5జీ సేవలను విస్తరిస్తామని ప్రకటించారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ 45వ వార్షిక సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇమ్మర్సివ్, ఇంటరాక్టివ్ మెటావర్స్ టెక్నాలజీ ద్వారా వార్షిక సాధారణ సమావేశంలో పాల్గొన్న ముఖేష్ అంబానీ..జియో 5జీ సేవలపై ప్రకటన చేశారు. ఏతినీ స్టాండలోన్ 5ఉ అని పిలువబడే 5ఉ యొక్క తాజా వెర్షన్‌ను అమలు చేస్తుందని చెప్పారు. 5జీ మౌలిక సదుపాయాలపై రూ.2 లక్షల కోట్లు పెట్టుబడి పెట్టనుందని వెల్లడించారు. ÷ళింద్ర టెలికమ్యూనికేషన్స్ శాఖ నిర్వహించిన 5జీ వేలం పాటలో ప్రభుత్వానికి సుమారు రూ. 1.5 లక్షల బిడ్లు వచ్చాయి. 5ఉ స్పెక్ట్రమ్ వేలం బిడ్డింగ్‌లో రిలయన్స్ జియో అగ్రస్థానంలో నిలిచింది. అటు దేశ వ్యాప్తంగా అక్టోబర్ నాటికి 5ఉ సేవలను అందుబాటులోకి తీసుకురావడానికి కేంద్రం సిద్ధమవుతోందని కమ్యూనికేషన్లు, ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రి అశ్విని వైష్ణవ్ ఇప్పటికే ప్రకటించారు.

# గెలుపు అంత సునాయాసంగా దక్కలేదు




(మొదటి పేజి తరువాయి) **దుబాయ్, ఆగస్ట్ 29 (సమ సమాజం):** ఆసియా కప్ 2022లో భారత్ జట్టు బోణీ కొట్టినా ..అది అంత సులువుగా సాధ్యం కాలేదు. లక్ష్యం స్వల్పమే అయినా పరుగులు సాధించడానికి నానా తంటాలు పడి చెమటోడ్చాల్సి వచ్చింది. నిజానికి టీవీల ముందు అతుక్కుపోయిన వారెవరికీ ఈ మ్యాగెలుస్తామన్న భరోసా లేకుండా పోయింది. జడేజా బౌల్డ్ కావడంతో ఆ ఆశలు బలపడ్డాయి. ఈ క్రమంలో పాండ్యా తెగించి ఆడడంతో చివరకు నరాలు తెగగే ఉత్కంఠ మధ్య విజయం భారత్ సొంతయ్యింది. ఇలా పాకిస్థాన్‌తో జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్‌లో 5 వికెట్ల తేడాతో తొలి విజయాన్ని అందుకుంది. అయితే మ్యాచ్‌ను సిక్స్‌తో హార్దిక్ పాండ్య గెలుపుగా ముగించేశాడు. ఆఖరి ఓవర్‌ను పాక్ స్పిన్నర్ వేయబోతున్నాడని ముందే పసిగట్టిన హార్దిక్ హిట్టింగ్ కోసం రెడీ అయిపోయి అదరగొట్టేశాడు. హార్దిక్ పాండ్య సత్తా ఎలాంటిదో.. తన సామర్థ్యానికి అతను పూర్తిగా న్యాయం చేస్తే ఫలితం ఎలా ఉంటుందో ఈ మ్యాచ్ రుజువు చేసింది. తనో నమ్మదగిన ఆల్‌రౌండర్ అని నిరూపించాడు. మొదట పాక్ ఇన్నింగ్స్‌లో అత్యధిక వికెట్లు (4) తీసింది భువనేశ్వరే కానీ.. భారత బౌలర్లలో హీరో మాత్రం హార్దిక్ పాండ్యనే. మ్యాచ్‌ను మలుపు తిప్పే బౌలింగ్ ప్రదర్శన అతడిదే. రిజ్వాన్, ఇఫ్తికార్‌ల మధ్య భాగస్వామ్యం ప్రమాదకరంగా మారుతున్న సమయంలో.. ఇఫ్తికార్‌ను ఔట్ చేసి భారత్‌కు అతను ఉపశమనాన్ని ఇచ్చాడు. ఆ తర్వాత ఒకే ఓవర్లో రిజ్వాన్, ఖుష్‌దిల్ షాల వికెట్లు పడగొట్టి పాక్ భారీ స్కోరు చేయకుండా అడ్డు పడ్డాడు. పేసర్లకు అనుకూలిస్తున్న పిచ్‌ను హార్దిక్ చాలా బాగా ఉపయోగించుకున్నాడు. షార్ట్ పిచ్ అస్త్రాన్ని అతను బాగా వాడుకుని పాక్‌ను దెబ్బ తీశాడు. ఆ తర్వాత బ్యాటింగ్‌లోనూ హార్దిక్ విలువైన ఇన్నింగ్స్ ఆడాడు. గెలిపించేలా కనిపించిన సూర్యకుమార్ ఔటైపోయి, సాధించాల్సిన రన్‌రేట్ పెరిగిపోతున్న సమయంలో క్రీజులో అడుగు పెట్టిన అతను.. తీవ్ర ఒత్తిడిలో గొప్ప ఇన్నింగ్స్ ఆడాడు. ఆఖర్లో అతను సిక్సర్‌తో మ్యాచ్ గెలిపించిన దృశ్యం చాన్నాళ్లు అభిమానుల మనసుల్లో నిలిచిపోతుందనడంలో సందేహం లేదు. కోహ్లీ ప్రయాణం కొంత కాలంగా ఒడుదొడుకులకు గురవుతోంది. పరుగుల లేమితో సతమతం అవుతున్న విరాట్.. శతకం కోసం సుదీర్ఘ కాలంగా నిరీక్షిస్తున్నాడు. ఆసియా కప్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో జరిగిన కీలక మ్యాచ్‌లో కోహ్లీ సెంచరీ కొడతాడని ఎందరో అభిమానులు వేచి చూశారు. కానీ విరాట్ మాత్రం 35 పరుగులకే పెవిలియన్ చేరాడు. ఓపెనర్ కేఎల్ రాహుల్ ఔటయ్యాక.. కోహ్లీ క్రీజులోకి వచ్చాడు. ఒక్కసారిగా అభిమానుల ఈలలతో స్టేడియం దద్దరిల్లిపోయింది. అందరూ కళ్లు అతడి బ్యాటింగ్ పైనే. అయితే కోహ్లీ సమయోచితంగా ఆడినా.. పాకిస్థాన్ బౌలర్ నవాజ్ వేసిన బంతికి క్యాచ్ఇచ్చి ఔటయ్యాడు. 34 బంతుల్లో 35 పరుగులు చేసిన కోహ్లీ.. 3 ఫోర్లు, ఒక్క సిక్స్ బాదాడు. గతేడాది టీ20 ప్రపంచకప్‌లో భాగంగా ఇదే మైదానంలో పాకిస్థాన్ చేతిలో ఎదురైన పరాభవానికి టీమ్ఇండియా బదులు తీర్చుకుంది. విజయ సమీకరణం క్లిష్టంగా మారిన తరుణంలో హార్దిక్ పిడుగుల్లాంటి షాట్లతో జట్టును గెలిపించాడు. హారీస్ వేసిన 19వ ఓవర్లో మూడు ఫోర్లు రాబట్టిన పాండ్యా.. చివరి ఓవర్ నాలుగో బంతికి సిక్సర్‌తో మ్యాచ్‌ను ముగించాడు. పాండ్యాకు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. భారత్ తమ తదుపరి పోరులో బుధవారం హాంకాంగ్‌తో తలపడనుంది.

# భాషా సంస్కృతులే మన చిరునామా



(మొదటి పేజి తరువాయి) **హైదరాబాద్, ఆగస్ట్ 29 (సమ సమాజం):** తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు తెలుగు ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. లండన్ పర్యటనలో ఉన్న ఆయన ప్రపంచంలో ఎక్కడ ఉన్నా మన భాషా సంస్కృతులే మన నిజమైన చిరునామా అంటూ ట్విటర్ వేదికగా పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరికీ తెలుగు భాషా దినోత్సవ శు భాకాంక్షలు... ప్రపంచంలో ఎక్కడ ఉన్నా మన భాషా సంస్కృతులే మన నిజమైన చిరునామా అని వెంకయ్యానాయుడు అన్నారు. భవిష్యత్ తరాలకు మన భాషా సంస్కృతుల వైభవాన్ని అందించేందుకు తెలుగు వారంతా పునరంకితం కావాలని ఆకాంక్షించారు. తెలుగు భాషను ప్రజలపరం చేసి, వాడుక భాషా ఉద్యమం సాగించిన గిడుగు రాంమూర్తి పంతులు జయంతి సందర్భంగా వారి స్మృతికి నివాళులు అర్పిస్తున్నానని చెప్పారు. గిడుగు చూపిన బాట ప్రతి ఒక్కరికీ ఆదర్శం కావాలని సూచించారు. అమ్మ భాష అందరి శ్వాస కావాలని పిలుపునిచ్చారు. ఎల్లలు దాటి తెలుగు వెలుగులు ప్రసరించాలని పేర్కొన్నారు.ఆత్మవిశ్వాసం పెంచే అమ్మ భాషను ప్రాథమిక విద్యలో పరిపాలనా భాషగా, న్యాయ స్థానాల కార్యకలాపాలు, సాంకేతిక విద్యలోనూ, కుటుంబ సభ్యులతో మాట్లాడే భాషగా వినియోగించడమే గిడుగు వారికి ఇచ్చే నిజమైన నివాళి అని స్పష్టం చేశారు. ఈ స్ఫూర్తి ప్రతి ఒక్కరికీ ఆదర్శం కావాలని వెంకయ్యానాయుడు ఆకాంక్షించారు. హాకీ లెజెండ్ ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా మనం జాతీయ స్పోర్ట్స్ డేను జరుపుకుంటున్నట్లు మరో ట్వీట్ చేశారు. హాకీ ఫీల్డ్‌లో అతని అద్భుతమైన విన్యాసాలు తర్వాతి తరాల క్రీడాకారులకు స్ఫూర్తినిస్తూనే ఉన్నాయని వివరించారు.

# హైదరాబాద్‌లో పలుచోట్ల వర్షం

నేడు కూడా పలు జిల్లాలో వర్షానికి ఛాన్స్




**హైదరాబాద్, ఆగస్ట్ 29 (సమ సమాజం):** హైదరాబాద్‌లో సోమవారం ఉదయం పలుచోట్ల అక్కడక్కడా వర్షం కురిసింది. ఆకాశం మేఘావృతమై తెల్లవారుజామున నగరంలో అక్కడక్కడ వర్షం కురిసింది. ఎల్బీనగర్, దిల్‌సుఖ్‌నగర్, మలక్‌పేట, కోఠి, ఉప్పల్, నాగోల్‌లో చిరుజల్లులు కురిశాయి. మధ్యాహ్నం మరింత ఎక్కవ కావడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. పలుచోట్ల ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రాష్ట్రం లోని పలు జిల్లాల్లో సోమ, మంగళవారాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ముందుగానే హెచ్చరికలు జారీ చేసింది. ఇవాళ మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట్, జనగాం, నాగర్ కర్నూల్, వనపర్తి, నల్గొండ, హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి, యాదాద్రి జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. ఉత్తరదక్షిణద్రోణి తూర్పు విదర్భ నుంచి దక్షిణ కోస్తాంధ్ర వరకు విస్తరించి, సముద్ర మట్టానికి 0.9కిలోమీటర్ల ఎత్తు వరకు కొనసాగుతుందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. పశ్చిమ, నైరుతి దిశ నుంచి రాష్ట్రంలోకి కింది స్థాయి గాలులు వీస్తున్నాయని చెప్పింది. వర్షం సమయంలో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. దక్షిణ, మధ్య తెలంగాణ జిల్లాలకు భారీ వర్షాలంటాయని అలర్ట్ చేశారు. ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, రంగారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ డైరెక్టర్ నాగరత్న వెల్లడించారు. ఈ వారం తర్వాత రాష్ట్రంలో వర్షాలు తగ్గే అవకాశం ఉందని క్లారిటీ ఇచ్చారు.

# మిడ్‌మానేరు నిర్వాసితులపై లాఠీ



(మొదటి పేజి తరువాయి) **హైదరాబాద్, ఆగస్ట్ 29 (సమ సమాజం):** ఊరికో మోసం..వాడకో మోసం.. ఇదీ కేసీఆర్ వేషం అని పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ట్వీట్ చేశారు. మిడ్ మానేరు నిర్వాసితులకు ఇచ్చిన హామీ నెరవేర్చకపోగా.. వాళ్లపైనే పోలీసు జులుం చేయిస్తవా అంటూ నిప్పులు చెరిగారు. ప్రగతి భవన్‌లో బిర్యానీ దావత్ ఇవ్వడమే రైతు సంక్షేమమా అని ఆయన ప్రశ్నించారు. ఈ సందర్భంగా మిడ్ మానేరు నిర్వాసితులపై పోలీసుల దౌర్జన్యం దుర్మార్గమని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న నిర్వాసితుల అరెస్టును ఖండిస్తున్నాన న్నారు. కాంగ్రెస్ నేత ఆది శ్రీనివాస్ హౌస్ అరెస్టును ఖండిస్తున్నానని రేవంత్ రెడ్డి చెప్పారు. అరెస్టు చేసిన నిర్వాసితులను తక్షణం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేసీఆర్ హామీ ఇచ్చిన ఆర్అండ్ఆర్ ప్యాకేజీ తోపాటు డబుల్ బెడ్రూం ఇళ్లు కూడా ఇవ్వాలని కోరారు. ఈ క్రమంలో నిర్వాసితులకు కాంగ్రెస్ పార్టీ అండగా రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# బిజెపి ఆపరేషన్ కమలం విఫలం



(మొదటి పేజి తరువాయి) **న్యూఢిల్లీ, ఆగస్ట్ 29 (సమ సమాజం):** ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సొంత ప్రభుత్వంపైనే విశ్వాస తీర్మానాన్ని ప్రవేపెట్టారు. కాషాయ పార్టీ 'ఆపరేషన్ కమలం' ఢిల్లీలో విఫలమైందని నిరూపించేందుకే తాను అసెంబ్లీలో విశ్వాస తీర్మానాన్ని తీసుకొచ్చానని చెప్పారు. ఆప్ ఎమ్మెల్యేలు నిజాయతీపరులని, పార్టీకి విధేయులుగా ఉంటారని అన్నారు. ఈ సందర్భంగా అసెంబ్లీలో మాట్లాడిన ఆయన బీజేపీపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మణిపుర్, బిహార్, అస్సాం, మహారాష్ట్రల్లో ప్రభుత్వాలన కూల్చివేశారని ఆరోపించారు. కొన్ని చోట్ల అయితే ఒక్కో ఎమ్మెల్యేను రూ.50 కోట్ల చొప్పున కొనేశారని, ఢిల్లీలోనూ అలాంటి ప్రయత్నాలు జరిగాయని చెప్పారు. ఆప్‌ను వీడి బీజేపీలో చేరితే రూ.20కోట్లు ఇస్తామంటూ 12 మంది ఎమ్మెల్యేలకు ఆఫర్ చేశారని, కానీ బీజేపీ ఆపరేషన్ కమల్ విఫలమైందన్నారు. తమ ఎమ్మెల్యేలు నిజాయతీపరులని, ఆప్ నుంచి ఒక్క ఎమ్మెల్యేను కూడా బీజేపీ వాళ్లు కొనుగోలు చేయలేరని రుజువు చేసేందుకే ఢిల్లీ అసెంబ్లీలో తీర్మానం తీసుకొచ్చానని ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ చెప్పారు. త్వరలో ఇంధన ధరలు మరింత పెరుగుతాయని, ఆ రేట్ల పెంపుతో వచ్చిన ఆదాయాన్ని ఇతర పార్టీల ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు ఉపయోగిస్తున్నారని కేంద్రంపై ఆరోపణలు చేశారు. ప్రస్తుతం విశ్వాస తీర్మానంపై ఢిల్లీ అసెంబ్లీలో చర్చ జరుగుతోంది. ఆ తర్వాత ఓటింగ్ నిర్వహించనున్నారు. అంతకుముందు అసెంబ్లీలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. సమావేశాలు ప్రారంభం కాగానే బీజేపీ ఎమ్మెల్యేలు సభలో ఆందోళనకు దిగారు. ఆప్ ప్రభుత్వం తీసుకొచ్చిన మద్యం విధానం, తరగతి గదుల నిర్మాణాల్లో జరిగిన అవకతవకలపై చర్చ చేపట్టాలంటూ పట్టుబట్టారు. అయితే.. డిప్యూటీ స్పీకర్ అంగీకరించకపోవడంతో ప్రతిపక్ష ఎమ్మెల్యేలు వెల్‌లోకి దూసుకొచ్చి ఆందోళన చేపట్టారు. దీంతో వారు సభ నుంచి బయటకు వెళ్లిపోవాలని డిప్యూటీ స్పీకర్ ఆదేశించారు. అయినా వారు వినిపించుకోకపోవడంతో మార్షల్స్‌తో బలవంతంగా బీజేపీ ఎమ్మెల్యేలను బయటకు పంపించేశారు. గత వారం అరవింద్ కేజ్రీవాల్ తన ఇంట్లో జరిగిన సమావేశానికి ఢిల్లీలోని ఆప్‌కి చెందిన 62 మంది ఎమ్మెల్యేలలో 53 మంది మాత్రమే హాజరైన సంగతి తెలిసిందే. మరోవైపు ఢిల్లీ మద్యం పాలసీలో అవకతవకలు జరిగాయని, అవినీతికి సంబంధించిన కేసులో డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియా ఇంట్లో సీబీఐ అధికారులు ఇటీవల దాడులు చేశారు.

# వచ్చే ఎన్నికల్లో బిజెపిని సాగనంపాలి

విపక్ష పార్టీల ప్రభుఏత్వాలను కూలుస్తున్న కేంద్రం◆విద్యార్థి ర్యాలీలో మమతా బెనర్జీ పిలుపు



**కోల్‌కతా, ఆగస్ట్ 29 (సమ సమాజం):** కమలదళానికి తగిన బుద్ధి చెప్పాలంటే వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని ప్రజలకు పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ పిలుపునిచ్చారు. ఈమేరకు కేంద్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాషాయ శిబిరాన్ని వ్యతిరేకించే పార్టీలపై కేంద్ర దర్యాప్తు సంస్థలు, అక్రమంగా సంపాదించిన డబ్బు ఉపయోగపడుతుందన్నారు. ప్రజాస్వామ్యంగా ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాలను పడగొట్టడానికి వీటిని ఉపయోగించుకుంటున్నారని ఆరోపించారు. తన పార్టీ విద్యార్థి విభాగం ర్యాలీలో పాల్గొన్న మమతా..బీజేపీపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. తనతో సహా ఫిర్హాద్ హకీమ్ , అభిషేక్ బెనర్జీతో సహా సీనియర్ తృణమూల్ నాయకులపై విష ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. బీజేపీ అందరినీ దొంగలుగా ముద్ర వేస్తోందని మమతా మండిపడ్డారు. ఇటీవల ఫిర్హాద్ హకీమ్‌ను కేంద్ర ఏజెన్సీలు పిలిపించినందున అతన్ని అరెస్టు చేసే అవకాశం ఉందన్నారు. మహారాష్ట్ర మోడల్‌లో ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దించేందుకు బీజేపీకి వేల కోట్లు ఎక్కడి నుంచి వస్తున్నాయని ప్రశ్నించారు. హవాలా ద్వారా బీజేపీ విదేశాల్లో డబ్బును దాచి పెడుతోందన్నారు. బేటీ బచావో బేటీ పఢావో గురించి గొప్పలు చెప్పకుంటున్న కేంద్రం..బిల్కిస్ బానో కేసులో నిందితులను విడుదల చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదేనా న్యాయం అంటూ ప్రశ్నించారు. నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కోల్ కతాలో 48 గంటలపాటు ధర్నా నిర్వహిస్తామన్నారు.

# క్రీడాకారులకు అన్ని విధాలుగా ప్రోత్సాహం

### ధ్యాన్‌చంద్ జయంతి కార్యక్రమంలో స్పీకర్



**కామారెడ్డి, అగస్టు 29 (సమ సమాజం):** క్రీడాకారులకు అన్ని విధాలుగా ప్రోత్సహిస్తామని అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మేజర్ ద్యానచంద్ జయంతిని పురస్కరింనుకుని నిర్వహించే జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా యువజన, క్రీడా సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో బాన్సువాడ పట్టణం మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హాకీలో దేశ ప్రతిష్టను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన గొప్ప క్రీడాకారుడు ద్యానచంద్. తన ప్రతిభతో వ్యక్తిగతంగా ప్రపంచంలోనే అత్యధికంగా గోల్స్ చేసిన హాకీ మాంత్రికుడు ద్యానచంద్ జయంతిని జాతీయ క్రీడా దినోత్సవంగా జరుపుకోవడం ఆయనకు మనం ఘనంగా అర్పించే నివాళి అన్నారు. బాన్సువాడ పట్టణంలోని క్రీడాకారుల సౌలభ్యం కోసం అన్ని వసతులతో మినీ స్టేడియం నిర్మించాం. క్రీడాకారులు దీనిని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని స్పీకర ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆర్డీవో రాజా గౌడ్, రైతు బంధు జిల్లా అధ్యక్షుడు అంజిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## పెన్షన్లను పంపిణీ చేసిన మంత్రి సత్యవతి

**ములుగు, అగస్టు 29 (సమ సమాజం):** పోరాడి సాధించుకున్న తెలంగాణలో సీఎం కేసీఆర్ సంపదన పెంచి పేదలకు పంచుతున్నారన్నారని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో లబ్దిదారులకు ఆసరా పింఛన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 57 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరికి వృద్దాప్య పింఛన్లను అందజేస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా 8,424 మంది లబ్దిదారులకు నూతన పింఛన్లను మంజూరు చేసినట్లు తెలిపారు. కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందన్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# ఏ ఒక్క హామిని నెరవేర్చని మోడీ



ప్రాంతీయ పార్టీలను దెబ్బతీయడమే వారి లక్ష్యం

మండిపడ్డ ఎన్సీపి అధినేత శరద్ పవార్

**ముంబై, అగస్టు 29 (సమ సమాజం):** మోడీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామినీ నెరవేర్చలేదని ఎన్సీపీ అధ్యక్షుడు శరద్ పవార్ తెలిపారు. చిన్న పార్టీలను అధికారానికి దూరంగా ఉంచడమే బీజేపీ ఎజెండా అన్నారు. 2014 సార్వత్రిక ఎన్నికల తర్వాత కేంద్ర ప్రభుత్వం అనేక వాగ్దానాలు చేసిందని, కానీ ఒక్క హామిని కూడా నెరవేర్చలేదన్నారు. దేశంలోని ప్రతి ఒక్కరికీ ఇల్లు ఇస్తామని ప్రధాని హామీ ఇచ్చారని.. కానీ దానిని నెరవేర్చడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. రాష్ట్రాలలో బీజేపీ అధికారంలోకి రావడానికి కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉపయోగిస్తుందని ఎన్సిపి చీఫ్ బీజేపీపై విమర్శలు చేశారు. ఈ ఏడాది జూన్ లో ఏక్ నాథ్ షిండే తో సహా 39 మంది శివసేన ఎమ్మెల్యేలు పార్టీకి వ్యతిరేకంగా తిరుగుబాటు చేయడం వెనుక బీజేపీ కుట్ర ఉందని శరద్ పవార్ ఆరోపించారు. ఉద్ధవ్ థాకరే నేతృత్వంలోని ప్రభుత్వం పతనానికి కమలదళమే కారణమన్నారు. ఎన్సీపీకి చెందిన ఇద్దరు సీనియర్ నేతలు అనిల్ దేశ్ ముఖ్, నవాబ్ మాలిక్‌లను వేర్వేరు మనీలాండరింగ్ కేసుల్లో ఈడీ చేత అరెస్ట్ చేయబడి ప్రస్తుతంలో జైలులో ఉన్నారన్నారు.

## ఎనిమిదేళ్లలో కేంద్రం చేసిందేమీ లేదు : విహెచ్

**హైదరాబాద్, అగస్టు 29 (సమ సమాజం):** కేంద్ర ప్రభుత్వం ఒక్క పైసా ఇస్తలేదని మంత్రి కేటిఆర్ అంటున్నారని, రాష్ట్రానికి నిధులు ఇచ్చామని కేంద్ర మంత్రులు చెప్తున్నారని, అయితే ఇందులో ఎవరు కరెక్ట్ అన్నది తెలియాలని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు అన్నారు. సోమవారం గాంధీ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ 8 ఏళ్లలో ఒక్క పని చేయలేదని విమర్శించారు. పైగా ప్రభుత్వరంగ సంస్థలలను అమ్మేస్తున్నారని అన్నారు. ధరల గురించి బండి సంజయ్ ఆలోచించాల న్నారు. నూపుర్ శర్మ, రాజాసింగ్ లు మహమ్మద్ ప్రవక్త మీద చేసిన వ్యాఖ్యలు సరైనవి కావన్నారు. సెప్టెంబర్ 4న పెరిగిన ధరలపై కాంగ్రెస్ పోరాటం చేస్తుందన్నారు. ధరలపై ప్రజల దృష్టిని మరల్చడానికి మత గొడవలు సృష్టిస్తున్నారని విమర్శించారు. మునుగోడు కాంగ్రెస్ అభ్యర్థిని ప్రకటించి ముందుకు వెళతామన్నారు. పార్టీకి పూర్వవైభవం రావాలంటే అందరం కలిసి పని చేయాలని వీహెచ్ సూచించారు.

# మధ్య మానేరు నిర్వాసితులు ఆందోళన



ముంపు బాధితులు మహాధర్నాతో ఉద్రిక్తత

పోలీసులు, నిర్వాసితులకు మధ్య తీవ్ర వాగ్వాదం

రైతులను అరెస్ట్ చేయడంపై విపక్షాల మండిపాటు

**రాజన్న సిరిసిల్ల, అగస్టు 29 (సమ సమాజం):** రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడలో ఉద్రిక్తత నెలకొంది. మధ్య మానేరు నిర్వాసితులు ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో పోలీసులు, నిర్వాసితులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ నంది కమాన్ వద్ద మధ్య మానేరు నిర్వాసితులు ఆందోళనకు దిగారు. పరిహారం చెల్లించాలనే డిమాండ్‌తో మధ్యమానేరు ముంపు బాధితులు మహాధర్న చేపట్టారు. ఈ క్రమంలో వివిధ గ్రామాల నుంచి ముంపు బాధితులు వేములవాడకు వెళ్లేందుకు యత్నించగా నంది కమాన్ వద్ద పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో వారు అక్కడే ధర్నాకు దిగారు. ఈ క్రమంలో పోలీసులు, నిర్వాసితులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కొంత మంది నిర్వాసితులు పోలీసుల వాహనాలకు అడ్డుగా కూర్చున్నారు. నిర్వాసితులను పోలీసులు ఎక్కడికక్కడే అరెస్టు చేసి స్థానిక పోలీస్‌స్టేషన్లకు తరలించారు. అదనపు ఎస్పీ చంద్రయ్య ఆధ్వర్యంలో డీఎస్పీలు నాగేంద్రాచారి, చంద్రశేఖర్, పెద్ద ఎత్తున పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహిస్తున్నారు. ప్రాజెక్టు కట్టిన నాటి నుంచి తమకు పూర్తి స్థాయి పరిహారం అందలేదని, సీఎం ఇచ్చిన హామీ మేరకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వలేదనే డిమాండ్లతో నిర్వాసితులు ఆందోళనకు దిగారు. మధ్య మానేరు నిర్వాసితులకు సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ నెరవేర్చలేదు. పరిహారం కోసం ధర్నా చేస్తున్న మిడ్ మానేరు నిర్వాసితులపై పోలీసుల దౌర్జన్యం దుర్మార్గం. ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న నిర్వాసితుల అరెస్టును ఖండిస్తున్నాం. అరెస్టు చేసిన నిర్వాసితులను తక్షణమే విడుదల చేయాలి. కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ తోపాటు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలి. నిర్వాసితులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని రేవంత్ ట్వీట్‌లో పేర్కొన్నారు. మధ్య మానేరు ముంపు బాధితులను పరామర్శిస్తే అరెస్టు చేస్తారా అని బిజెపి అధ్యక్షుడు బండి సంజయ్ మండిపడ్డారు. మహిళలు అని కూడా చూడకుండా అరెస్టు చేయడమేంటన్నారు. మధ్య మానేరు ప్రాజెక్టు కోసం భూములు త్యాగం చేసిన వారిని ఇవాళ పోలీసులు అరెస్టు చేశారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయి. వారి డిమాండ్లన్నీ న్యాయమైనవే అని బండి సంజయ్ ట్వీట్ చేశారు.

# బిజెపి ముక్త భారత్‌తోనే దేశానికి మేలు

(మొదటి పేజి తరువాయి) కార్మికులకు బోనస్ ఇస్తున్నాం. రామగుండం పట్టణాన్ని కార్పొరేషన్ చేసుకున్నాం. ఏ విధమైన కార్యక్రమాలు అమలవుతున్నాయో మీకు తెలుసు అని కేసీఆర్ తెలిపారు. నిన్న గాక మొన్న 26 రాష్ట్రాలనుంచి దాదాపు 100 మంది రైతు నాయకులు వచ్చారని కేసీఆర్ తెలిపారు. తెలంగాణ ఇరిగేషన్ ప్రాజెక్టులను చూశాం. రైతులతో మాట్లాడం. ఈ రాష్ట్రంలో అమలవుతున్న కార్యక్రమాలు మా దగ్గర అమలు కావడం లేదు. జాతీయ రాజకీయాల్లోకి రావాలని ఆహ్వానించారు. జాతీయ రాజకీయాల్లోకి పోదామా? అని సభలో ఉన్న జనాలను కేసీఆర్ ప్రశ్నించారు. గుజరాత్ మోడల్ అని చెప్పి దేశ ప్రజలను ఈ మోదీ దగా, మోసం చేశారని కేసీఆర్ ధ్వజమెత్తారు. అడ్డగోలుగా ధరలు పెంచారు. స్మశానాల మీద పన్ను, పాలమీద జీఎస్టీ, చేనేత మీద జీఎస్టీ, పేద ప్రజలు ఉసురుపోసుకుంటూ.. లక్షల రూపాయాలు మేస్తూ బీజేపీ అవినీతి గద్దలు దేశాన్ని మోసం చేస్తున్నాయని దుయ్యబట్టారు. కొన్ని సన్నివేశాలు స్వయంగా చూస్తున్నాం. గాంధీ పుట్టిన రాష్ట్రంలో మద్యపానం నిషేధం చేశామని చెప్తారు. ప్రధాని మోదీ సొంత రాష్ట్రంలో కల్తీ మద్యానికి 79 మంది బలయ్యారు. అక్కడ కల్తీ మద్యం ఏరులై పారుతోంది. దీని మీ సమాధానం ఏంటని అడుగుతున్నాను అని మోదీని ఉద్దేశించి కేసీఆర్ ప్రశ్నించారు. రైతుల పట్ల కఠినంగా ప్రవర్తిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీపై సీఎం కేసీఆర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. 2024లో ఈ దేశం నుంచి బీజేపీని పారద్రోలాలని పిలుపు నిచ్చారు. రైతులకు మీటర్ పెట్టాలని అంటున్న ఈ మోదీకే మీటర్ పెట్టాలన్నారు. రైతులకు మేలు చేస్తూ పేదలను ఆదుకుంటుంటే వాటిని ఉచితాలు అని బంద్ పెట్టాలని అంటున్నారు. ఉచిత కరెంట్ ఇస్తే మీటర్ పెట్టాలని అంటున్నారు. రేపు రాబోయే భారతదేశంలో ఈ బీజేపీని పారదోలి రైతుల ప్రభుత్వం రాబోతుంది. ఈ గోల్ మాల్ ప్రధానమంత్రి, కేంద్ర ప్రభుత్వం పచ్చి అబద్దాల ఆడుతూ, దేశ ప్రజలను మోసం చేస్తున్నారు. దేశంలోని మొత్తం వ్యవసాయానికి వాడే కరెంట్ కేవలం 20.8 శాతం మాత్రమే. దాని ఖరీదు ఒక లక్షా 45 వేల కోట్లు.ఓ కార్పొరేట్ దొంగకు దోచిపెట్టినంత కాదు కదా మోదీ. రైతుల కోసం మీరు బయల్దేరండి అని ఆయా రాష్ట్రాల రైతులు నన్ను కోరారు. మీటర్ లేని రైతు రావాలని కోరారు. భారతదేశం స్వాగతం పలుకుతుందన్నారు. రైతులకు మీటర్ పెట్టాలని అంటున్న మోదీకి మనందరం కలిసి మీటర్ పెట్టాలి. ఆ పని చేస్తే మనకు పీడ వోతది. ఏ ఒక్క రంగంలో కూడా దేశాన్ని బాగు చేసింది లేదు. అనేక రంగాల్లో అవినీతి నెలకొని ఉందని కేసీఆర్ ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో మంత్రులు గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యేలు బాల్క సుమన్, చందర్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు ముఖ్యమంత్రి కేసీఆర్ పెద్దపల్లి జిల్లాలో రూ. 48కోట్లతో నిర్మించిన సమీకృత కార్యాలయాల సముదాయాన్ని ప్రారంభించారు.

# రైతు సంక్షేమంలో చెరుకు రైతులు లేరా

నిజాం షుగర్ ఫ్యాక్టరీని ఎప్పుడు తెరుస్తారు

చెరుకు రైతుల ఆందోళనలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి



**జగిత్యాల, అగస్టు 29 (సమ సమాజం):** నిజాం షుగర్ ఫ్యాక్టరీ తెరవకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి హెచ్చరించారు. గతంలో హామీ ఇచ్చిన కెసిఆర్ ఎందుకు తెరవడం లేదన్నారు. రైతుల సంక్షేమంలో ఇది లేదా అని అన్నారు. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం ముత్యంపేటలో రైతుల ధర్నాకు జీవన్ రెడ్డి మద్దతు తెలిపారు. షుగర్ ఫ్యాక్టరీని వెంటనే తెరిపించాలంటూ బోనాల వేడుక నిర్వహించారు. పోతురాజుల విన్యాసాలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. షుగర్ ఫ్యాక్టరీని తెరిపించాలని డిమాండ్ చేస్తూ రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మతల్లికి బోనాలు సమర్పించారు. ఆ తర్వాత షుగర్ ఫ్యాక్టరీ ముందు బైఠాయించారు. షుగర్ ఫ్యాక్టరీ తెరిపించడంలో ఃఖా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని రైతులు ఆరోపించారు. ఇతర రాష్ట్రాల రైతు నాయకులను పిలిపించుకొని గొప్పలు చెప్పుకునే ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఫ్యాక్టరీ పరిధిలో ఉన్న చెరుకు రైతులపై ఎందుకు కనికరం చూపడం లేదని జీవన్ రెడ్డి ప్రశ్నించారు. కొత్త ఫ్యాక్టరీలు తెస్తున్నట్లు పదేపదే చెబుతున్న కేసీఆర్.. ఉన్న ఫ్యాక్టరీలపై ఎందుకు దృష్టి పెట్టడం లేదని నిలదీశారు. మూతపడ్డ మూడు నిజాం చెక్కర ఫ్యాక్టరీలను వెంటనే తెరిపించాలని డిమాండ్ చేశారు.

## అభివృద్ధితో 8 ఏళ్లలో ఎంతో మార్పు

### మాహబూబ్‌నగర్ రూపు రేఖలు మారాయి: మంత్రి



**మహబూబ్‌నగర్, అగస్టు 29 (సమ సమాజం):** మహబూబ్‌నగర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని, 8 ఏండ్లలో ఎంతో మార్పు చెందిందని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలో నూతన ఆసరా పింఛన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మహబూబ్‌నగర్ రూపు రేఖలు మార్చాలన్న ఏకైక లక్ష్యంతోనే ముందుకెళ్తున్నట్లు తెలిపారు. మహబూబ్‌నగర్‌లో అత్యంత వెనుకబడిన ప్రాంతాలుగా పేరొందిన టీడీగుట్ట, వీరన్నపేటలో గతంలో ఎలాంటి సౌకర్యాలు ఉండేవి కాదని, ప్రస్తుతం వీరన్నపేటలో డబుల్‌బెడ్రూం ఇండ్లు కట్టించామని, టీడీగుట్ట వరకు బైపాస్ రహదారి నిర్మిస్తున్నామని తెలిపారు. హన్వాడ వద్ద ఫుడ్ పార్క్ ఏర్పాటు చేసి పరిశ్రమలు నెలకొల్పుతున్నామన్నారు. త్వరలోనే పాతకలెక్టరేట్ స్థానంలో రూ.500 కోట్లతో సూపర్ స్పెషాలిటీ దవాఖాన నిర్మిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, వైస్ చైర్మన్ తాటిగణెశ్, మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్, కౌన్సిలర్లు కోట్ల నర్సింహులు, మాధవీలత, మునీర్, నాయకులు శివరాజ్, చిన్న, శ్రీనివాస్, మార్కెట కమిటీ వైస్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, అనంతయ్య,చిన్న, సత్యం యాదవ్,చెన్నయ్య లక్ష్మణ్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## ధ్యాన్‌చంద్ ఆదర్శంగా ఉన్నత శిఖరాలకు చేరాలి

### జాతీయ క్రీడా దినోత్సవంలో మంత్రి ఇంద్రకరణ్




**నిర్మల్, అగస్టు 29 (సమ సమాజం):** యువతీ యువకులకు ధ్యాన్ చాంద్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా హాకీ అసోసియేషన్ చైర్మన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ధ్యాన్ చంద్ చిత్ర పటానికి పూలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత దేశ ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన గొప్ప ఆటగాడు ధ్యాన్ చంద్ అన్నారు. పేద కుటుంబంలో పుట్టి దేశానికి ఒలింపిక్స్ లో ఎన్నో బంగారు పతకాలు సాధించి పెట్టాడని ప్రశంసించారు. ఆయన జీవితాన్ని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. క్రీడలతో ఆరోగ్యంగా ఉంటామన్నారు. పిల్లలకు తల్లిదండ్రులు చిన్నప్పటి నుంచే క్రీడల పట్ల ఆసక్తి ని పెంచేలా ప్రోత్సహించాలన్నారు. అనంతరం పాకల ఫౌండేషన్ కన్వీనర్ పాకాల రాంచందర్ ఆధ్వర్యంలో జాతీయ క్రీడల్లో గెలిచిన క్రీడాకారులను సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ ధర్మజి రాజేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక వెంకట రమణ, పట్టణ అధ్యక్షుడు మారుగొండ రాము, అల్లోల మురళీధర్ రెడ్డి, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ ఆకోజి కిషన్, సుదర్శన్, హకీ కార్యదర్శి నిర్మల్ జిల్లా, వ్యాయామ ఉపాధ్యాయుడు కే భోజన్న స్కూల్ గేమ్స్ పీడీలు భూమన్న, లక్ష్మణ్, అన్నపూర్ణ, స్కూల్ గేమ్స్ సెక్రటరీ ఎం శ్రీనివాస్, పాల్గొన్నారు.

# ట్రేడింగ్ యాప్ పేరుతో అమాయకులకు టోకరా






(మొదటి పేజి తరువాయి) రికవరీ చేశారు. మార్కెట్ బాక్స్ యాప్ ద్వారా పెట్టుబడులు, ట్రేడింగ్ పేరుతో కోట్ల రూపాయలు కొల్లగొడుతున్న రాజస్థాన్, యూపీకి చెందిన ముఠాను సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. మొత్తం 10 మంది గల ఈ ముఠాలో ఇప్పటి వరకు నలుగురిని కటకటాల్లోకి నెట్టారు. మార్కెట్ బాక్స్ అనే ట్రేడింగ్ నకిలీ యాప్‌ను రూపొందించి.. సామాజిక మాధ్యమాల వేదికగా దీనిపై పెద్ద ఎత్తున ప్రచారం చేసినట్లు పోలీసులు గుర్తించారు. సెబీలోనూ రిజిస్టర్ కాని ఈ యాప్‌లో 3 వేల మంది వరకు నమోదు చేసుకుని.. లావాదేవీలు జరిపినట్లు సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర తెలిపారు. అమాయకుల నుంచి ఈ ముఠా రూ.10 కోట్ల వరకు ఆన్‌లైన్ వేదికగా వసూలు చేసి మోసాలకు పాల్పడినట్లు చెప్పారు. గత ఏడాది ఓ బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో విచారణ ప్రారంభించగా.. ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చినట్లు సైబరాబాద్ సిపి స్టీఫెన్ రవీంద్ర తెలిపారు. యూపీలోని చందోలి జిల్లా పోలీసుల సహకారంతో ఈ కేసును ఛేదించినట్లు సైబరాబాద్ నేర విభాగం డీసీపీ కల్మేశ్వర్ తెలిపారు. మొబైల్‌లో యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకునే సమయంలో అప్రమత్తంగా వ్యవహరిం చాలని ఆయన సూచించారు. మరోవైపు 'మార్కెట్ బాక్స్' యాప్ పేరుతో నిందితులు మోసాలకు పాల్పడుతున్నారని.. ఇందులో 3 వేల మంది సభ్యత్వం తీసుకున్నారని సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర తెలిపారు. 10 మంది సభ్యుల ముఠాలో నలుగురిని అరెస్ట్ చేసినట్లు చెప్పారు. రూ.62 లక్షల వరకు పెట్టుబడి పెట్టి.. రూ.34 లక్షల దాకా నష్టపోయిన బాధితుడి ఫిర్యాదుతో కేసును ఛేదించినట్లు సీపీ స్పష్టం చేశారు. మార్కెట్ బాక్స్ యాప్ ద్వారా వ్యాపారం, పెట్టుబడి పేరుతో అమాయకులను మోసం చేస్తున్నారు. 10 మంది సభ్యుల ముఠాలో నలుగురిని అరెస్టు చేశాం. పెట్టుబడులకు రెట్టింపు లాభాలు ఇస్తామని నమ్మించారు. ఒక వ్యక్తి రూ.62 లక్షలు పెట్టుబడి పెట్టి రూ.34 లక్షలు నష్టపోయారు. దాదాపు 3 వేల మంది ఈ యాప్‌లో సభ్యత్వం తీసుకున్నారు. కాగా, మార్కెట్ బాక్స్ యాప్ సెబీలో నమోదు కాలేదని స్టీఫెన్ రవీంద్ర వెల్లడించారు.

## రూ. 1.18 కోట్ల విలువ చేసే 594 కిలోల గంజాయి పట్టివేత

**భద్రాద్రి కొత్తగూడెం, అగస్టు 29 (సమ సమాజం):** భద్రాచలంలో భారీ స్థాయిలో గంజాయి పట్టుబడింది. రూ. 1.18 కోట్ల విలువ చేసే 594 కేజీల గంజాయిని పోలీసులు సీజ్ చేశారు. గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఏఎస్పీ బీ రోహిత్ రాజ్ మాట్లాడుతూ.. ఆదివారం రోజు భద్రాచలం ఫారెస్ట్ చెక్ పోస్టు వద్ద ఎస్ఐ మధు ప్రసాద్ ఆధ్వర్యంలో తనిఖీలు జరిగాయన్నారు. అనుమానాస్పదస్థితిలో వెళ్తున్న ఓ రెండు కార్లను పోలీసులు ఆపడంతో.. అందులో ఉన్న వ్యక్తులు పరారీ అయ్యారు. ఒక్కరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇక కార్లలో ఉన్న 594 కేజీల గంజాయిని సీజ్ చేశారు. పట్టుబడ్డ వ్యక్తిని సారపాకకు చెందిన అన్వేష్‌గా గుర్తించారు. ఒడిశా నుంచి చెన్నైకి గంజాయిని తరలిస్తున్నట్లు అన్వేష్ పోలీసులకు తెలిపాడు. రాము, మహేందర్ గంజాయిని స్మగ్లింగ్ చేస్తున్నట్లు పేర్కొన్నాడు. తమిళనాడులో జయ కుమార్ అనే వ్యక్తికి గంజాయిని విక్రయిస్తున్నట్లు తేలింది. పరారైన కుమార్, ప్రవీణ్ కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# సిద్దిపేటలో 2కె రన్ ప్రారంభించిన మంత్రి

### క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్న హరీష్ రావు





**సిద్దిపేట, అగస్టు 29 (సమ సమాజం):** రాబోయే రోజుల్లో సిద్దిపేటలో అన్ని క్రీడలకు కావాల్సిన మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు అన్నారు. త్వరలోనే 400 మీటర్ల రన్నింగ్ ట్రాక్‌ను అందుబాటులోకి తేనున్నట్లు మంత్రి తెలిపారు. జిల్లా కేంద్రంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని 2కె రన్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు చాలా ముఖ్యమని, మనిషి ఆరోగ్యంగా ఉండేందుకు ఆటలు ఆడాలన్నారు. ఇప్పుడిప్పుడే సమాజం యోగ, క్రీడల పట్ల ఆసక్తి కనబరుస్తుండటం శుభపరిణామమని మంత్రి పేర్కొన్నారు. సిద్దిపేటలో క్రికెట్ స్టేడియం, ఫుట్ బాల్, వాలీబాల్ అకాడమీ ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులను తీర్చిదిద్దిన కోచ్‌లు, క్రీడాకారులను మంత్రి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రఘోత్తం రెడ్డి, జిల్లా స్పోర్ట్స్ క్లబ్ కన్వీనర్ పాల సాయిరాం, మార్కెట్ కమిటీ చైర్మన్ మచ్చ విజిత, తదితరులు పాల్గొన్నారు.

# చలన చిత్రం

## తెలుగులో సుదీప్ కోటిగబ్బా-3 విడుదలకు సన్నాహాలు


కన్నడ హీరో సుదీప్ తెలుగులో మార్కెట్‌ను పెంచుకునే పనిలో ఉన్నాడు. 'రక్త చరిత్ర' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన సుదీప్ 'ఈగ', 'బాహుబలి', 'సైరా' వంటి సినిమాలతో టాలీవుడ్‌లో మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. ఇక ఇటీవలే విడుదలైన 'విక్రాంత్ రోన'తో ఈయనకు జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చింది. ఈ చిత్రం కన్నడతో పాటు విడుదలైన ప్రతి భాషలో ఘన విజయం సాధించింది. ఇదిలా ఉంటే గతేడాది కన్నడలో విడుదలై బ్లాక్ బాస్టర్‌గా నిలిచిన 'కోటీగబ్బా-3' ఇప్పుడు తెలుగు విడుదలకు సిద్ధమైంది. తెలుగులో ఈ చిత్రాన్ని 'ఐ3 కోటికొక్కడు' టైటిల్‌తో మేకర్స్ విడుదల చేస్తున్నారు. యాక్షన్ థ్రిల్లర్ నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రం సెప్టెంబర్ 16న విడుదల కానుంది. నిజానికి ఈ చిత్రం జూలైలోనే విడుదల కావాల్సి ఉంది. అయితే మేకర్స్ విక్రాంత్ రోన ఫలితం తర్వాత ఈ చిత్రాన్ని విడుదల చేయాలని భావించారు. ఇక విక్రాంత్ రోన తెలుగులో భారీ విజయం సాధించిన విషయం తెలిసిందే. కోటి ఇరవైదు లక్షల థియేట్రికల్ బిజినెస్ జరుపున్న విక్రాంత్‌రోన్గ ÷నైల్‌గా సుమారు 4కోట్ల వరకు షేర్‌ను సాధించి బ్లాక్ బాస్టర్‌గా నిలిచింది. ఈ క్రమంలో ఐ3 మేకర్స్ ఇదే కరెక్టు టైం అని భావించి సినిమాను విడుదల చేస్తున్నారు. తెలుగులో ఈ చిత్రాన్ని గుడ్ సినిమా గ్రూప్ సమర్పిస్తుంది. శివ కార్తిక్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో సుదీప్‌కు జోడీగా మడోన్నా సెబాస్టియస్ హీరోయిన్‌గా నటించింది. రాంబాబు ప్రొడక్షన్ బ్యానర్‌పై సూరప్ప బాబు ఈ చిత్రాన్ని నిర్మించాడు.



## 2న విడుదలవుతున్న రంగరంగ వైభవంగా

'ఉప్పెన' సినిమాతో ఇండస్ట్రీలోకి గ్రాండ్ ఎంట్రీ ఇచ్చాడు వైష్ణవ్ తేజ్. మొదటి సినిమాతోనే అత్యధిక ఓపెనింగ్స్ రాబట్టిన డెబ్యూ హీరోగా రికార్డు సృష్టించాడు. అంతేకాకుండా ఈ సినిమాతో 100కోట్ల క్లబ్‌లోకి అడుగుపెట్టాడు. ఈ సినిమా తర్వాత భారీ అంచనాలతో వచ్చిన 'కొండపొలం' తీవ్రంగా నిరాశపరిచింది. ఇక ప్రస్తుతం వైష్ణవ్ తేజ్ 'రంగరంగ వైభవంగా' సినిమాతో ప్రేక్షకులను పలకరించడానికి సిద్ధమయ్యాడు. గిరీశయ్య దర్శకత్వం వహించిన ఈ చిత్రం సెప్టెంబర్ 2న విడుదల కానుంది. ఇప్పటికే చిత్రం నుండి విడుదలైన పాటలు, ట్రైలర్ సినిమాపై విపరీతమైన అంచనాలను క్రియేట్ చేశాయి. తాజాగా మేకర్స్ ఈ సినిమాలోని 'కొత్తగా లేదేంటి' వీడియో సాంగ్‌ను విడుదల చేశారు. ఇప్పటికే విడుదలైన 'కొత్తగా లేదేంటి' ఆడియో సాంగ్‌కు శ్రోతల నుండి విశేషమైన స్పందన వచ్చింది. కాగా తాజాగా మేకర్స్ వీడియో సాంగ్‌ను విడుదల చేశారు. వైష్ణవ్ తేజ్, కేతిక శర్మ కెమిస్ట్రీ బాగా కుదిరినట్లు కనిపిస్తుంది. దేవీ శ్రీ ప్రసాద్ స్వర పరిచిన ఈ పాటను శ్రీమణి రచించగా.. ఆర్మాన్ మాలిక్, హరి ప్రియ ఆలపించారు. ఈ చిత్రంలో వైష్ణవ్ తేజ్‌కు జోడీగా కేతికశర్మ హీరోయిన్‌గా నటించింది. శ్రీ వెంకటేశ్వరా సినీ చిత్ర బ్యానర్‌పై బీవీఎస్ఎన్ ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మించాడు.



## కోబ్రా మూవీ అందరికి నచ్చుతుంది చియాన్ విక్రమ్ భరోసా

కోబ్రా మూవీ టికెట్లు దొరకడం లేదని తన భార్య ఫోన్ చేసి చెప్పిందన్నాడు హీరో చియాన్ విక్రమ్.. ఈ మాట విన్నప్పుడు చాలా ఆనందంగా అనిపించిందన్నారు. కోబ్రా సినిమా చేస్తున్నపుడు చాలా ఎంజాయ్ చేశాని.. సినిమా చూస్తున్నపుడు మీరూ ఎంజాయ్ చేస్తారని తెలిపాడు. కోబ్రా ఆగస్ట్ 31న వస్తోంది. ఈ మూవీ ఖచ్చితంగా మీ అందరికీ నచ్చుతుందని చెప్పాడు. విక్రమ్ హీరోగా ఆర్ అజయ్ జ్ఞానముత్తు దర్శకత్వంలో తెరకెక్కిన యాక్షన్ థ్రిల్లర్ కోబ్రా. సెవెన్ స్క్రీన్ స్టూడియోస్ బ్యానర్‌పై ఎస్ఎస్ లలిత్ కుమార్ నిర్మించిన ఈ చిత్రం తెలుగులో ఎన్వీ ప్రసాద్ ఎన్వీఆర్ సినిమా ద్వారా విడుదలౌతుంది. ఆగస్ట్ 31న ఈ మూవీ ప్రపంచవ్యాప్తంగా విడుదలకాబోతుంది. ఈ నేపథ్యంలో తాజాగా 'కోబ్రా' చిత్ర యూనిట్ హైదరాబాద్ లోని శరత్ సిటీ క్యాపిటల్ మాల్ లో మీట్ అండ్ గ్రీట్ ఈవెంట్ ను గ్రాండ్ గా నిర్వహించింది. చిత్ర యూనిట్ పాల్గొన్న ఈ ఈవెంట్ కి జనం భారీగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హీరో విక్రమ్ మాట్లాడుతూ.. 'మీ అందరినీ చూస్తుంటే చాలా ఉత్సాహంగా ఉంది. ఈ ఎనర్జీని చూసి చాలా రోజులైయింది. ఇక్కడికి వచ్చిన ప్రేక్షకులు, అభిమానులందరికీ కృతజ్ఞతలు. కోబ్రాని తెలుగులో తిరుపతి ప్రసాద్ లాంటి మంచి నిర్మాత విడుదల చేయడం చాలా ఆనందంగా, గర్వంగా ఉంది. ఏవీ చూసినప్పుడు ఇన్ని పాత్రలు నేనే చేశానా? అని నాకే ఆశ్చర్యమేసింది. మనందరికీ సినిమా అంటే ప్రేమ. నాకు నటన మీద ఎంతపిచ్చో మీకు సినిమా మీద అంత పిచ్చి. మీ అందరి ప్రేమకి కృతజ్ఞతలు. నా సినిమా థియేటర్లోకి వచ్చి మూడేళ్ళు అయ్యింది. ఈ సినిమాతో మీ అందరినీ కలుసుకోవడం చాలా ఆనందంగా ఉంది. కోబ్రా విజువల్ ట్రీట్. కోబ్రా, అపరిచితుడు లాంటి సైకలాజికల్ థ్రిల్లర్. యాక్షన్, రోమాన్స్, ఫ్యామిలీ, లవ్, ఎమోషన్స్ అన్ని ఎలిమెంట్స్ అన్నీ అంతకుమించి ఉంటాయి. ఇందులో ముగ్గురు హీరోయిన్స్ శ్రీనిధి, మీనాక్షి, మృణాళిని.. ముగ్గురు పాత్రలు బావుంటాయి. కోబ్రా మీ అందరికీ నచ్చుతుంది' అన్నారు. ఏఆర్ రెహ్మాన్ వీడియో ద్వారా మాట్లాడుతూ.. 'తెలుగు ప్రేక్షకులకు నమస్కారం. మీ అందరి ప్రేమ అభిమానానికి కృతజ్ఞతలు. కోబ్రా ఆగస్ట్ 31న విడుదలౌతుంది. థియేటర్ లో చూసి ఆనందిస్తారని కోరుతున్నాను' అన్నారు.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8897334003 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in